సాక్షి మెదక్

శనివారం । 15 । జూలై । 2023



బస్సును ఢీ కొన్న కారు 8లో

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామశివారులో ఆర్టీసీ బస్సును ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.



తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు పంపే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. 8లో

అదనపు కలెక్టర్ బదిలీ

మెదక్‌జోన్: మెదక్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ శుక్రవారం రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె 28 జూన్ 2021న మెదక్‌కు అదనపు కలెక్టర్‌గా వచ్చారు. రెండేళ్లపాటు మెదక్‌లో విధులు నిర్వర్తించిన ప్రతిమాసింగ్.. జిల్లాలో పలు అనుమతులు లేని నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించి, పాలనలో తనదైన ముద్ర వేశారు.

న్యూస్‌రీల్

క్రీడా పాఠశాలల ప్రవేశానికి ఎంపిక



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: క్రీడా పాఠశాలలకు ఎంపికకు స్పందన లభించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. శనివారం కూడా ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో హకీంపేటలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు శ్రీధర్ రెడ్డి, చంద్రమోహన్, దేవేందర్ రెడ్డి, మహిపాల్, రవి, మధు, రాజేందర్, సత్యనారాయణ, వినోద్, హరీష్, శంకర్, రూపేందర్, కిరణ్, ప్రదీప్, ప్రభాకర్, మనోహర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తాం



సంకాపూర్ పాదయాత్రలో తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ పథకాల్లో పెద్ద ఎత్తున జరిగిన అవినీతిని ప్రజలకు వివరిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా నార్సింగి మండలం సంకాపూర్, సంకాపూర్ తండాలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వెనుక అవినీతి దాగుందని, అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడినవారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రమణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీమాన్‌రెడ్డి, కేశవులు, పాషా, కిష్టయ్య, యాదగిరి, అజయ్‌గౌడ్, శంకర్‌నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేతనాలు సవరించకుండా కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. పరిశ్రమల్లో నూటికి 90 శాతం కాంట్రాక్ట్ కార్మికులు ఉంటున్నారని, 60 శాతం ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనని అన్నారు. వలస కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చేయిస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, ఉపాధ్యక్షులు నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

110 రోజుకు చేరిన దీక్షలు



రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారం 110 రోజులకు చేరాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించమని అఖిలపక్ష ప్రతినిధులు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలకు వ్యాపార సంఘం, యువజన సంఘాలు, కుల సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.

బాల్యం.. బలహీనం

- చిన్నారులకు అందని పౌష్టికాహారం
- పిల్లల ఎత్తు, బరువులో తేడాలు
- జిల్లాలో 288 మందిలో పోషకాహార లోపం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువును కొలుస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: హాయిగా, ఆరోగ్యంగా ఆడుతూ పాడుతూ సాగాల్సిన బాల్యం బక్కచిక్కి పోతుంది. రేపటి తరం బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. మహిళలు గర్భందాల్చిన 3 నెల నుంచి పాలు, గుడ్లు, పప్పు భోజనం అందిస్తోంది. శిశువు 7 నెలల వయసు మొదలు మూడేళ్లు వచ్చే వరకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్నా.. కొంతమంది చిన్నారుల్లో శారీరక ఎదుగుదల వెనుకబడుతోంది. చిన్నారులు వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాలో మెదక్, రామాయంపేట, అల్లాదుర్గం, నర్సాపూర్‌లో అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 1,076 కేంద్రాలు ఉన్నాయి.
- 885 మెయిన్, 191 మినీ కేంద్రాల్లో కలిపి 48,281 చిన్నారులు ఉన్నారు.
- పతీనెలా మొదటి వారంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు కొలుస్తారు.
- జిల్లాలో సుమారు 288 మంది బాలలు తక్కువ బరువుతో పాటు ఎత్తు పెరగకుండా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.
- ఎత్తు, బరువు సరిగా లేని పిల్లలు గత నెల జూన్‌లో 287 మంది ఉండగా, ఈ నెలలో ఆ సంఖ్య 288కి పెరిగింది.
- గర్భందాల్చిన మూడు నెలల నుంచి పోషకాహారం తీసుకోవాల్సి ఉండగా, చాలా చోట్ల పౌష్టికాహారం అందడంలేదు.

ప్రయోజనం అంతంతే..

- పోషకాహార లోప నివారణకు ఐసీడీఎస్ అధికారులు, వైద్యసిబ్బంది అవగాహన కల్పిస్తున్నా.. ఆశించిన మేర ఫలితాలు కనిపించటంలేదు.
- పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామాల్లో పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- నిరక్షరాస్యులైన గర్భిణులకు అవగాహన లేకపోవటం, ఆర్థిక పరిస్థితుల కారణంగా అవసరమైన పోషకాహారం తీసుకోకపోవడం దీనికి కారణంగా చెప్పవచ్చు.
- చాలా మంది గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడ అందించే పౌష్టికాహారం తినడంలేదని తెలుస్తోంది. దీంతో గిరిజన మహిళలు ఎక్కువగా రక్తహీనతకు గురవుతున్నారు.
- ప్రతీరోజు జిల్లాలో 6,169 మంది గర్భిణులకు, 4,173 మంది బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా భోజనంతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నారు.
- లోపం ఎక్కువగా ఉన్న కేంద్రాలను గుర్తించి బాలామృతంతో పాటు అదనంగా పల్లిపట్టీలు, న్యూట్రీషన్‌తో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రావటంలేదు.
- ఏడు నెలల గర్భిణులకు అందించే కిట్‌లో రూ.2వేల విలువగల హైప్రొటీన్ ఫుడ్ ఉన్నట్లు సంబంధిత వైద్యాధికారులు చెబుతున్నారు.
- జిల్లాలో 6,169 మంది గర్భిణులు ఉండగా 7 నెలలు నిండిన వారు 1500 మందికి కిట్లను అందించారు.

చర్యలు చేపడుతున్నాం

జిల్లాలో పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారుల విషయంపై ప్రత్యేక దృష్టి సారించాం. వీరికి బాలామృతం ప్లస్‌ను ఇస్తున్నాం. తల్లిదండ్రులతో మాట్లాడి సెలవు రోజుల్లో పిల్లలకు మంచి ఫుడ్ ఇవ్వాలని చెబుతున్నాం. వైద్యులతో పరీక్షలు చేయించి లోపాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బ్రహ్మాజీ, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు స్పందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. నియోజకవర్గంలోని 18 ఏళ్లు పైబడిన యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో మండలాల వారిగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజే 1,633 దరఖాస్తులు వచ్చాయి. ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్లు జయరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడతాం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు యేసు రత్నం, జిల్లా నాయకుడు నందం మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోవడం లేదని అన్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ పేద కుటుంబాలపై భారం మోపుతుందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి, లేబర్ కోడ్లను రద్దు చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జూలై 20న చలో హైదరాబాద్ సదస్సు ఉంటుందని, దీనిని విజయవంతం చేయాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యపై నిర్లక్ష్యం వద్దు

మెదక్‌జోన్: ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో భవిష్యత్ అంధకారంగా మారుతోందని ఆరోపించారు. రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శశికాంత్, ఉదయ్ కిరణ్, విజ్ఞాన్, నితిన్, అనిల్, సత్య, మనోజ్ పాల్గొన్నారు .

నేరవేరిన ఏడేళ్ల కల

చిలప్‌చెడ్/కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు ఓ చోట రెవెన్యూ మండలం మరో చోట ఉండడంతో ఏడేళ్లుగా ఇబ్బందులు పడిన ఆయా గ్రామాల ప్రజల కల నెరవేరింది. శేరిఫైజాబాద్, లింగరావ్‌గూడ, దానుగూడ, మంగళపల్లి గ్రామాల రెవెన్యూను చిలప్‌చెడ్ మండలంలో, అంతారం గ్రామ రెవెన్యూను కౌడిపల్లి మండలంలో కలుపుతున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ గెజిట్ జారీపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చిలప్‌చెడ్ మండలంలో ఉన్న శేరి ఫైజాబాద్, లింగారావ్‌గూడ, దానుగూడ, మంగళపల్లి గ్రామాల రెవెన్యూ కౌడిపల్లిలో, కౌడిపల్లి మండలంలో అంతారం గ్రామ రెవెన్యూ చిలప్‌చెడ్‌లో ఉండడంతో ఇంత కాలం నానా ఇక్కట్లు పడ్డామని, ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుల నియామకం

మెదక్ మున్సిపాలిటీ: బీఎస్పీ నియోజకవర్గాల అధ్యక్షులను శుక్రవారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుతాడి నర్సింలు అధ్యక్షతన మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన ఎలక్షన్ కమిటీ సమావేశంలో నియామకం చేశారు. మెదక్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కమ్మరి కృష్ణమూర్తిచారి, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా తాళ్ల జనార్దన్‌గౌడ్‌ను నియమించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్‌లు నామలక్ష్మి, న్యాత మాణయ్య, ఉపాధ్యక్షులు స్వామిదాస్, శాంతికుమార్, రవిగౌడ్, దేవయ్య పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ ఉద్యోగులకు పాపెన్షన్ విధానం అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేష్ అన్నారు. శుక్రవారం వడియారంలో సీపీఎస్ సాధన సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో సైతం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవయ్య, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సురేష్



ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

స్వచ్ఛత బాటలో గ్రామాలు

- కలెక్టర్ రాజర్షిషా
- ఆదర్శ గ్రామం కొంగోడ్ సందర్శన

కొల్చారం(నర్సాపూర్): ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాలు స్వచ్ఛత బాటలో పయనిస్తున్నాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ గ్రామం కొంగోడ్‌ను అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీపీఓ సాయిబాబాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడుగుంతలు, పచ్చదనాన్ని పరిశీలించి, సర్పంచ్ మంజుల, సిబ్బందిని అభినందించారు. జిల్లాలోని 469 గ్రామపంచాయతీలు స్వచ్ఛతలో ముందున్నాయని, కొంగోడ్ గ్రామం అన్ని అంశాల్లో ఆదర్శంగా నిలువడం అభినందనీయమన్నారు. త్వరలో రాష్ట్ర, కేంద్ర స్థాయి బృందం కొంగోడ్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. సోంపిట్ల ద్వారా బయటకు వెళ్లే నీరు పూర్తి స్వచ్ఛతగా గ్రామ సమీపంలో చెరువులు, కుంటల్లోకి చేరుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఎంపీడీఓ గణేష్ రెడ్డి, ఎంపీఓ కృష్ణవేణి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు వేమారెడ్డి తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు.



కొల్చారం: పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

మండలంలోని కుకునూర్, వెల్దుర్తి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి తనిఖీ చేశారు. పెండింగ్ పనులను నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కుకునూర్‌లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటకపోవడంపై ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. వెల్దుర్తి పాఠశాలలో టాయిలెట్స్, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను పరిశీలించారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 600లకు పైగా చేరడంపై హెచ్‌ఎం సాంబయ్య, డీఈఓ రాధాకిషన్‌ను అభినందించారు. మండలంలోని కుకునూర్ గ్రామానికి కలెక్టర్ వస్తున్నాడని తెలిసిన పాఠశాల ఆవరణలో ఉన్న పంచాయతీ నర్సరీలో పేరుకుపోయిన చెత్తా చెదారం, గడ్డిని హుటాహుటిన తొలగించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

శివ్వంపేట(నర్సాపూర్): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, కేసుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్ సీట్ బెల్ట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలపై కళాబృందంతో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, పోలీస్ సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. తూప్రాన్ సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రవికాంత్‌రావు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థుల పఠనాశక్తిని పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. సబ్జెక్టుల వారీగా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాలో 18 పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. 102 పాఠశాలల్లో పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయని, నెలాఖరుకు 150 పాఠశాలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆయనతో హెచ్‌ఎం సాంబయ్య, సిబ్బంది ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొంగోడ్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులు ధారాళంగా చదివేలా శిక్షణ అందించాలని ఆదేశించారు. ఆయనతో ఎంఈఓ నీలకంఠం, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, యశోద ఉన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సదాశివపేట రూరల్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో జరిగిన ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొని డ్రైవర్‌తో సహా ఆరుగురికి గాయాలయ్యాయి.


న్యాల్‌కల్: బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సును ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హద్నూర్ ఎస్‌ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం..కర్నాటక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తుంది. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జహీరాబాద్–బీదర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆల్టోకారు రాంగ్ రూట్లో వచ్చి బస్సును ఢీ కొంది. కారును అతి వేగంగా నడపడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు డ్రైవర్ సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా అంగారాజీపల్లి గ్రామానికి చెందిన వాడు. మరో వ్యక్తి వెంకటేశ్వర్ రాజ్ గుంటూర్ జిల్లాకు చెందిన వాడని ఎస్‌ఐ తెలిపారు. తీవ్ర గాయాలైన వెంకటేశ్వర్‌రాజును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బస్సు కండక్టర్ శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రఘు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సదాశివపేట రూరల్‌లో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న మినీ అంబులెన్స్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే అదుపు తప్పింది. పార్కు చేసిన ఇన్నోవా వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ సర్జీరావు భారటీ(45)స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో అయన్ను మరో అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై చోటు చేసుకుంది. జీపీపీ ఆర్టీసీ డిపో సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు 25మంది ప్రయాణీకులతో జేబీఎస్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారు జామున ప్రజ్ఞాపూర్ సమీపంలో రింగురోడ్డు మీదుగా వెళ్తున్న క్రమంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రాజ్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గుండెపోటుతో ఇద్దరి మృతి

వద్దేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందగా, కొండపాక విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పూస బాల కిషన్ గుండెపోటుకు గురై మృతి చెందారు.

రాయపోలు(దుబ్బాక): వద్దేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..సూర్యాపేట జిల్లా లింగాల గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరెడ్డి (54) వద్దేపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇక్కడ 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీనివాస రెడ్డి గజ్వేల్‌లో నివాసముంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం పాఠశాలకు వెళ్లొచ్చిన ఆయన రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృతితో వద్దేపల్లి పాఠశాలలో విషాదం నెలకొంది.


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

గుండెపోటుతో వాచ్‌మెన్..

కొండపాక(గజ్వేల్): 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న పూస బాలకిషన్(36) గుండెపోటుతో మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన బాలకిషన్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. దినచర్యలో భాగంగా గురువారం డ్యూటీ చేస్తుండగా శుక్రవారం ఉదయం నిద్రలేవలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ పుష్పరాజ్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని శివసాయి నగర్ కాలని సమీపంలోని దినేష్ హోమ్స్ ప్రక్కన నాలాలో ఒక గుర్తు తెలియని మహిళా మృతదేహం శుక్రవారం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి ఎడమ చేతిపై ×మధు, అంజి, అమ్మ౯ అనే పచ్చబొట్టును గుర్తించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతురాలి చేతిపై మధు, అంజి, అమ్మ అని పచ్చబొట్టు

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ముద్దాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కురుమ యాదగిరి (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పొలం వద్ద జారి పడగా కాలు విరిగింది. ఆరు నెలల క్రితం బైక్‌పై నుంచి పడి కాలు విరిగింది. అప్పటి నుంచి సరిగా నడవ లేక పోతున్నాడు. దీంతో పొలం పనులు చేసుకోలేక తరచూ బాధ పడుతుండే వాడు. ఈ నెల 8న పొలానికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి రాలేదు. దీంతో అతని భార్య పొలం వద్దకు వెళ్లి చూడగా యాదగిరి పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. వెంటనే అతన్ని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


యాదగిరి (ఫైల్)

మైనర్లను పనిలో పెట్టుకోవద్దు

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్

కోహీర్(జహీరాబాద్): మైనర్లను పనిలో పెట్టుకోవద్దని జహీరాబాద్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ నర్సిములు సీడబ్లుఎస్సీ సభ్యులు శ్రావణ్‌కుమార్‌తో కలిసి కోహీర్ పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లు, వ్యాపారసంస్థలలో తనిఖీలు నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. వారిని పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి వందశాతం అక్షరాస్యత సాధించడానికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


కోహీర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాలకార్మికుడిని బడిలో చేర్పించిన అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): బడిమానేసిన బాలకార్మికుడిని గుర్తించి మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం చేర్పించామని ఎంఈఓ అంజయ్య తెలిపా రు. వివరాలు ఇలా ఉన్నాయి..కొండాపూర్ మండలంలోని ఆదర్శ జిమ్యాక్స్ కాలనీలో నివాసం ఉంటూ చెత్త సేకరిస్తూ కనిపించడంతో అతని వివరాలు తెలుసుకొని ఇంటికి వెళ్లి తల్లి ముంతాజ్‌కు చదువు విలువ గురించి వివరించి ఒప్పించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మెహరాజ్‌లు, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాకేశ్, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు సహకరించారని ఎంఈఓ అంజయ్య తెలిపారు.


తల్లి ముంతాజ్‌కు నచ్చచెబుతున్న ఎంఈఓ దండు అంజయ్య

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

మెదక్‌జోన్: కుక్కల దాడిలో నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఔరంగాబాద్ తండాలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఔరంగాబాద్ తండాకు చెందిన మాలోత్ శ్రీను రోజూమాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి రాత్రి కొట్టంలో కట్టివేశాడు. తెల్లారి చూసే సరికి కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను చంపేసినట్లు బాధితుడు శ్రీను తెలిపారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. సంఘటనా స్థలాన్ని వెటర్నరీ అధికారి లక్ష్మణ్ సందర్శించారు.

నిందితుడికి యావజ్జీవ శిక్ష

చేగుంట(తూప్రాన్): వరకట్న వేధింపుల కారణంగా భార్య మృతికి కారణమైన భర్తకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. 2017లో మక్కరాజీపేట గ్రామంలో అగలదివిటి మానస(24) వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు మానస భర్త విక్రమ్‌జీ పై చేగుంట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాంగోపాల్ రావు విచారణ చేసి నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో వాదనలు విన్న జడ్జి లక్ష్మీశారద నిందితుడు విక్రమ్‌జీ నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి సాక్షులను ప్రవేశ పెట్టగా ప్రభుత్వ న్యాయవాది ఫైజల్‌అహ్మద్ వాదనలు వినిపించారు. కేసు విచారణకు చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్, కానిస్టేబుల్ లక్ష్మీపతి తూప్రాన్ డీఎస్పీకి సహాయకులుగా పనిచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి అదృశ్యం

కోహీర్(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కొత్తగొల్ల తుక్కప్ప, భార్య ఈశ్వరమ్మ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో కలిసి 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌కు వెళ్లారు. ఈశ్వరమ్మ, శ్రీనివాస్ తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. తుక్కప్ప మాత్రం కనిపించకుండా పోయాడు. తుక్కప్ప కోసం బంధుమిత్రుల వద్ద, తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు. తుక్కప్ప అదృశ్యం వెనుక భార్య ఈశ్వరమ్మ, శ్రీనివాస్ హస్తం ఉందని తుక్కప్ప తమ్ముడు విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ లక్ష్మీబాబు

రామాయంపేట(మెదక్): 35కు పైగా చోరీ కేసులతో సంబంధం ఉన్న అంతర్ రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం ..నార్సింగి మండలం కాస్లాపూర్‌కు చెందిన బాలమణి గత నెల 25న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుంది. అక్కడే మాటువేసి ఉన్న నిందితుడు మరొకరితో కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయాడు. తూప్రాన్ మండలం హైదర్‌గూడ గ్రామానికి చెందిన ఓ మహిళ పుస్తెలతాడు అపహరించిన కేసులో ఇతడే ప్రధాన నిందితుడని సీఐ పేర్కొన్నారు. నిందితుడు బల్జీత్‌సింగ్ సంకాపూర్ స్టేజీవద్ద ఉండగా అతన్ని అరెస్ట్ చేసి విచారించారు. ఈ విచారణలో తను గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన బల్జీత్‌సింగ్‌కు కర్ణాటకలో, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పలు కేసులతో సంబంధం ఉందని సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బాలాజీసింగ్, శంశేర్‌సింగ్‌ల కోసం గాలిస్తున్నామని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ లక్ష్మీబాబు, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట ఎస్‌ఐలు నర్సింలు, శ్రీనివాసరెడ్డి, ఎస్‌హెచ్‌వో సురేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు భాస్కర్, నాగభూషణం, కుమార్, ఖాజా జహంగీర్, యాదగిరి, కృష్ణ, సూర్యప్రకాశ్‌ను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించి రివార్డులు అం


మాట్లాడుతున్న సీఐ లక్ష్మీబాబు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- సికింద్రాబాద్ నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న వైనం
- లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 209 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులోని రిమ్, జిమ్ దాబా వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ దినేష్ పోలేను అదుపులో తీసుకున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న దాదాపు 209 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని పటాన్‌చెరు పౌరస రఫరాల గోదాంకు తరలించారు. డీటీసీఎస్‌లు విష్ణు వర్ధన్, దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


లారీని సీజ్ చేసిన అధికారులు

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

కంది(సంగారెడ్డి): కంది మండలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మామిడిపల్లి, ఏర్దనూర్ ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు శుక్రవారం ఛిద్రుప్పశివారులోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించారు. గ్రామ శివారులోని సర్వేనంబర్లు 116, 117లలో అసైన్డ్ భూమిలో నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి నిర్మాణాలకైనా సరే హెచ్ఎండీఏ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ అధికారులు

గ్రానైట్ లారీ బోల్తా

తొగుట(దుబ్బాక): గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట నుంచి గజ్వేల్‌కు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీకి ఎదురుగా మరోక వాహనం రావడంతో లారీని ప్రక్కకు తప్పించబోయేక్రమంలో అదుపుతప్పింది. దీంతో పంట పొలంలోకి దూసుకుపోయి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.


పొలంలో బోల్తాపడిన గ్రానైట్ లారీ

తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా మోసం చేస్తున్నారు. ఫోన్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పింక్ వాట్సప్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్ నమ్మి మోసపోవద్దన్నారు. ఆ లింక్‌ని క్లిక్ చేసి యాప్ ఇన్స్టాల్ చేస్తే మీ ఫోన్‌లో పూర్తి డాటా ఫొటోస్, కాంటాక్ట్స్, బ్యాంకింగ్ డిటెయిల్స్ ఓటీపీ, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతాయన్నారు. మిలియన్ల మంది వినియోగదారులతో, దేశంలో అత్యధికంగా ఉపయోగించే మెసేజింగ్ ప్లాట్‌ఫాంలలో వాట్సాప్ ఒకటి అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా పింక్ వాట్సాప్ పేరుతో ఓ లింక్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని పేర్కొన్నారు. పింక్ వాట్సాప్ లింక్‌ను క్లిక్ చేస్తే మీ ఫోన్‌లో ఉన్న సమాచారమంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. అదే విధంగా మీ బ్యాంకు ఖాతాల, సోషల్ మీడియా అకౌంట్ల పాస్‌వర్డ్‌లను మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి ఫోన్‌లకు వచ్చే ఎటువంటి మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు.



పింక్ వాట్సాప్‌కు సంబంధించిన లింకులు

గిరిజనుల రాస్తారోకో



ప్రేమికుడితో పెళ్లి జరిపించాలని డిమాండ్

శివ్వంపేట(నర్సాపూర్): యువతిని ప్రేమించి మోసం చేసిన యువకుడితోనే పెళ్లి జరిపించాలని డిమాండ్ చేస్తూ తండా వాసులు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిధి భోజ్యతండాకు చెందిన యువతి ఇదే మండలం వెంక్యా తండాకు చెందిన నరేశ్ ప్రేమించుకున్నారు. ప్రేమ విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి చెందిన వ్యక్తితో నాలుగు నెలల క్రితం వివాహం జరిపించారు. యువతిని ప్రేమించిన నరేశ్ అప్పటి ఫోన్ సంభాషణలతో పాటు పాత ఫొటోలు యువతి భర్తకు పోస్ట్ చేశారు. దీంతో యువతిని పుట్టింటికి పంపించేశారు. ఈ విషయంపై ఇరు తండా వాసుల పెద్దలు రెండు రోజులుగా మాట్లాడారు. పెళ్లి చేసుకున్న వ్యక్తితో ప్రేమ వ్యవహారం గొడవలకు దారితీయడానికి కారణమైనందున, యువతిని ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకోవాలని ఇరు తండా పెద్దలు నిర్ణయించారు. అందుకు యువకుడు ఒప్పుకున్నాడని, మరుసటి రోజు పెళ్లి చేసుకోనని మాటమార్చడంతో యువతి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కౌన్సిలింగ్ ఇచ్చినా మారని యువకుడు

శుక్రవారం ఎస్‌ఐ రవికాంత్‌రావు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మహిళా సంఘాల నేతలు యువతిని పెళ్లి చేసుకోవాలని నరేష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. పెళ్లి చేసుకోకపోతే చట్ట ప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పినా పెళ్లి చేసుకోవడానికి అతడు ఒప్పుకోలేదు.

ఆందోళనకు దిగిన గిరిజనులు

ప్రేమించిన యువతి జీవితం పాడుచేసిన నరేశ్‌తోనే పెళ్లి జరిపించాలని డిమాండ్ చేస్తు భోజ్య తండా సర్పంచ్ రాజునాయక్ ఆధ్వర్యంలో గిరిజనులు శుక్రవారం రాత్రి ఆందోళన చేపట్టారు. తూప్రాన్–నర్సాపూర్ హైవే పై బైఠాయించి రాస్తారోకో చేశారు. యువతికి న్యాయం చేసేంత వరకు రోడ్డుపై నుంచి తప్పుకునేది లేదని నినాదాలు చేశారు. యువకుడితోపాటు అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనుల రాస్తారోకో తో ఇరువైపుల వాహనలు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డాన్నారు. యువకుడి పెళ్లికి ఒప్పుకోవడం లేదని అతడిపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవికాంత్‌రావు తండా వాసులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

నిందితుడికి రిమాండ్


సాక్షులను విచారిస్తున్న సీఐ, ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): తండ్రిపై దాడి చేసి అతని మరణానికి కారణమైన కొడుకును రిమాండ్‌కు తరలించారు. భూమి కౌలు విషయమై గట్లమల్యాలలో ఎర్రవెల్లి రాజయ్యపై అతని కుమారుడు ఎర్రవెల్లి రవి దాడి చేయడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం రవిని రిమాండ్‌కు తరలించామని వారు తెలిపారు.

వెజ్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న దుకాణాలు

సిద్దిపేటజోన్: స్థానిక ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్‌లో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. కూరగాయలను విక్రయించే బ్లాక్‌లో రెండు దుకాణాలు దగ్ధం అయ్యాయి. మంటలను సకాలంలో సిబ్బంది ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ వెంకటయ్యలు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20వేల కూరగాయలు దగ్ధం అయినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో జరిగిన దుర్గమ్మ జాతర మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల రెడ్డి, తోపాజీ అనంత కిషన్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

2 Acres @ Padalapally (V), Thoopran (M), Medak (Dist), Sy.No. 185/1, Rs. 1.30 Cr. P/Acre. Clear Title. Negotiable & Open Plot 27x60 for Sale 35,000 P/Sq.yard @ Bharathnagar, Moulali, Hyd Ph: 9440886371 [H-189226]

SERVICES

మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788601]

CHANGE OF NAME

I, Gopu Carmela (Before Marriage) R/o. H.No. 3-15, Bayyaram (V), Gajwel Mandal, Siddipet Dist., T.S., have changed my name as Gopu Carmela Thirumala Reddy Kavitha W/o. Thirumala Reddy Sudhakar Reddy (After Marriage). [HA-1215881]

WANTED

ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ ప్రతినెల 25 వేల పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్ పైన, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్, స్టూడెంట్స్ మరిన్ని వివరాలకు : 85001 48297 [V- 797232]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.